నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, ఆదివారం 9 జూన్ 2024 | VIKARABAD

## రేపు ప్రజావాణి కార్యక్రమం



రంగారెడ్డి, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ శశాంక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## గ్రూప్-1 పరీక్షకు భారీ బందోబస్తు



వికారాబాద్, జూన్ 8 : వికారాబాద్ జిల్లాలో గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరిగేలా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, యాలాలలో మొత్తం 13 గ్రూప్ -1 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 5468 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర ఎలాంటి ఆటంకాలు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవ్వరూ గుంపులుగా ఉండవద్దని సూచించారు. పోలీస్ అధికారులకు జిల్లా వాసులు సహకరించాలన్నారు. అభ్యర్థులకు ట్రాఫిక్ లేదా ఇతర ఏదైనా ఇబ్బంది ఉంటే డయల్ 100కి కాల్ చేసి పోలీస్ అధికారుల సాయం తీసుకోవాలని సూచించారు.

# సీజనల్‌పై అప్రమత్తం



- వానకాలంలో వ్యాధులు ప్రబలకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు
- టైఫాయిడ్, మలేరియా, డయేరియా, కలరా వ్యాధుల నివారణకు చర్యలు
- పరిశుభ్రతపై ఊరూరా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు
- సీజనల్ వ్యాధులు ప్రబలితే తక్షణమే చికిత్స అందించేందుకు ఏర్పాట్లు




వికారాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : వానకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులను ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు సంబంధిత అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఒకవేళ ఎక్కడైనా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడినట్లు సమాచారం వచ్చిన వెంటనే రంగంలోకి దిగి చికిత్స అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. వ్యాధుల వ్యాప్తి కారకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఈగలు, అపరిశుభ్రత, నిల్వ నీరు, మురుగునీరు, దోమకాటుతో అతిసార, కామెర్లు, టైఫాయిడ్, మలేరియా, కలరా డెంగీ తదితర వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లాలో గతంలో ప్రమాదకరమైన డెంగీ కేసులు కూడా నమోదైన దృష్ట్యా ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది.

### అవగాహన కార్యక్రమాలు..

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు వైద్యారోగ్య శాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. గతంలో డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో ఫీవర్ సర్వేను కూడా నిర్వహించే దిశగా ముందుకెళ్తున్నారు. ఎక్కడైనా సీజనల్ వ్యాధుల కేసులు పెరిగినట్లయితే జిల్లావ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహించి వ్యాధి లక్షణాలను ప్రారంభంలోనే గుర్తించి చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరం, జలుబు, తలనొప్పి తదితర లక్షణాలున్నవారి వివరాలను సేకరించనున్నారు. ఆయా వ్యాధి లక్షణాలను బట్టి నేరుగా ఇంటి వద్దనే ఉచితంగా మందులను అందించనున్నారు. జ్వరం, జలుబు, తలనొప్పి లక్షణాలు మూడు, నాలుగు రోజులైనా తగ్గకపోయినట్లయితే సంబంధిత వ్యక్తుల రక్త నమూనాలను సేకరించి, పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపనున్నారు. డెంగీ, మలేరియా నిర్ధారణ అయితే ప్లేట్‌లెట్స్ తగ్గకుండా ప్రత్యేక చికిత్స అందించనున్నారు. డెంగీ కేసులు నమోదైన పరిసర ప్రాంతాల్లోని ఇండ్లలో ప్రత్యేక సర్వే చేపట్టి డెంగీ లక్షణాలున్నట్లయితే రక్త నమూనాలను సేకరించి అవసరమైన చికిత్స అందించనున్నారు. ఇందుకుగాను జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లోనూ డెంగీ వ్యాధుల చికిత్సకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచేలా జిల్లా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టింది. గ్రామాల్లో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల ఆధ్వర్యంలో డయేరియాపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా వానకాలంలో నీరు కలుషితం కావడంతోనే డయేరియా వచ్చే ప్రమాదమున్న దృష్ట్యా అవగాహన కల్పించడంతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లను అందించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా..

వాతావరణం చల్లబడడంతోపాటు ప్రతి రోజూ ఓ మోస్తరు నుంచి ముసురు కురుస్తున్నది. దీంతో సీజనల్ వ్యాధులు కూడా ప్రబలే అవకాశాలున్నాయి. ఇప్పటికే చలి, జ్వరాలతో ఆసుపత్రులకు క్యూ కడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. టైఫాయిడ్ జ్వరాలతో మొదలై సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉండడంతో ఆదిలోనే అరికట్టేందుకు అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

ముఖ్యంగా వర్షాలు పడుతుండడంతో నీటి కాలుష్యం పెరగడంతోపాటు డ్రైనేజీ నీరు తాగునీటి పైపుల్లోకి చేరడంతో డయేరియా, కామెర్లు వచ్చే అవకాశమున్నది. అందుకోసం శుభ్రమైన, కాచి వడపోచిన నీటినే తీసుకోవాలి. వర్షపు నీరు నిల్వ ఉండడం, మురుగు నీటితో దోమలు వ్యాప్తి చెందుతాయి. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకోవడంతోపాటు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. తినేముందు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. వేడి, వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి, ఆహార పదార్థాలపై మూతలు సరిగ్గా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. పిల్లలకు జ్వరం, జలుబు, దగ్గు వచ్చినట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు...

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య శాఖ సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు అవసరమైన చర్యలు చేపట్టాం. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతాం. డెంగీ కేసులు నమోదైతే సంబంధిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వేను కూడా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. ఇండ్లలో, ప్రభుత్వ సంస్థల్లో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి.

– డాక్టర్ పల్వన్‌కుమార్, వికారాబాద్ డీఎంహెచ్‌వో





శంకర్‌పల్లి మండలంలోని సంకేపల్లి గ్రామంలో కురుస్తున్న వర్షం

# ఊరూరా మీనరాశి

- మృగశిరకార్తెకు జోరుగా చేపల విక్రయాలు
- కొనుగోలుదారులతో కిక్కిరిసిన దుకాణాలు
- రూ.200 నుంచి రూ.500 వరకు పలికిన ధరలు

మృగశిరకార్తె రోజున చేపలు తినడం ఆనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఈ రోజున చేపలు తినటం వలన అనేక రోగాలు దూరమవుతాయనే నమ్మకం ప్రజల్లో ఉన్నది. కాగా, శనివారం మృగశిరకార్తెను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున చేపల అమ్మకాలు జరిగాయి. పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి విక్రయించారు. కొనుగోలుదారులతో చేపల దుకాణాలు కిక్కిరిశాయి. ఇబ్రహీంపట్నంతో పాటు పలు చెరువుల వద్ద జాతర వాతావరణం కనిపించింది. చేపలకు డిమాండ్ పెరగడంతో ధరలు చుక్కలనంటాయి. కొర్రమీను రూ.400నుంచి రూ.500వరకు విక్రయించగా, బొచ్చ, రవ్వలాంటి చేపలు రూ.200 నుంచి రూ.300 వరకు అమ్మారు.

-ఇబ్రహీంపట్నం, జూన్ 8







శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో..

# జోరు వాన..

కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వానలు జోరుగా కురుస్తున్నాయి. వానకాలం ప్రారంభంలోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి నారు పోయడం, విత్తనాలు విత్తడం వంటి వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీబీజీగా గడుపుతున్నారు. శనివారం సైతం పలు మండలాల్లో భారీ వర్షం కురవగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల్లో పొలాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది.



శేరి లింగంపల్లి, జూన్ 8: వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డేను పురస్కరించుకొని గచ్చిబౌలి కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన వాకథాన్ నిర్వహించారు. బ్రెయిన్ ట్యూమర్ బారినపడి విజయవంతంగా చికిత్స పొందిన వారితో ఈ అవగాహన వాకథాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రముఖ ఐఏఎస్ రజత్ కుమార్, డాక్టర్ రూప కొడువాయర్, ఆప్టిమస్ గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పీఎంఎక్స్ సహ వ్యవస్థాపకులు డాక్టర్ సమతా తుల్లాలు ఈ వాకథన్‌కు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. మెదడు సంరక్షణ, బ్రెయిన్ ట్యూమర్ ప్రాబల్యాన్ని గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి ఈ వాకథాన్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, బ్రెయిన్ ట్యూమర్ బారినపడి పలువురు బాధితులు విజయవంతంగా చికిత్స పూర్తిచేసుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నారని పేర్కొన్నారు.

వారితో ప్రత్యేకంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కేర్ హాస్పిటల్ హెచ్‌సీఓఓ సునీత్ అగర్వాల్ పేర్కొన్నారు. కేర్ హాస్పిటల్‌కు చెందిన పలువురు వైద్యులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ సైక్లింగ్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో శనివారం దుర్గం చెరువు వద్ద స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. ఉద్యోగులందరూ కలిసి ప్రతి శని, ఆదివారాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. అందులో భాగంగా దుర్గం చెరువు వద్ద ఉన్న చెత్త, ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సైక్లింగ్ రెవల్యూషన్ సభ్యుడు రవి మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌తో పర్యావరణం నాశనమవుతుందన్నారు. అందుకే ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను పురపాలక శాఖ నిషేధించిందన్నారు.

'చాలా మంది నగరంలో ఏ వస్తువు కొనుగోలు చేసినా.. వాటిని ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆహార పదార్థాలను సైతం వాటిలోనే పార్సిళ్లు తీసుకుని తింటున్నారు. ఇది ప్రమాదమని తెలిసినా.. ఏం కాదులే అనే నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సాంత్వన్, శ్రీధర్, రమ్య తదితరులు పాల్గొన్నారు.